సాక్షి
వికారాబాద్
ఆదివారం । 7 ఏప్రిల్ । 2024





కార్యకర్తల జోష్



సభకు హాజరైన జనసందోహం




న్యూస్‌రీల్

రీపోలింగ్‌కు అవకాశం ఇవ్వొద్దు

వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు నారాయణరెడ్డి, శశాంక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి

వికారాబాద్: రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా లోక్‌సభ ఎన్నికలు నిర్వహించాలని వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు సీ నారాయణరెడ్డి, శశాంక అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పోలింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోకి రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయన్నారు. ఈ ఏడు నియోజకవర్గాల్లో 29,19,465 మంది ఓటర్లు ఉన్నారని, 2,824 పోలింగ్ కేంద్రాలు గుర్తించామని తెలిపారు. ఎన్నికల సిబ్బంది తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఫారం -12ను అందజేస్తామన్నారు. 85 సంవత్సరాల వయస్సు పైబడిన వృద్ధులు, 40 శాతం అంగవైకల్యం ఉన్న వారు ఇంటి వద్దే ఓటు వేసేందుకు ఫారం -12డీని అందజేస్తామన్నారు. పోలింగ్ కేంద్రా ల్లో అన్ని రకాల వసతులు కల్పిస్తామన్నారు. చేవెళ్లలోని బండారి శ్రీనివాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో కౌంటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి, రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ, రెండు జిల్లాల ఆర్డీవోలు సూరజ్ కుమార్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కూలీలను భాగస్వామ్యం చేయండి: డీఆర్‌డీఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్

తాండూరు రూరల్: ఉపాధి హామీ పథకంలో కూలీలను భాగస్వాములు చేయాలని డీఆర్‌డీఓ శ్రీనివాస్ ఆదేశించారు. శనివారం పట్టణంలోని ఉపాధి హామీ కార్యాలయంలో వికారాబాద్, పరిగి, తాండూరు క్లస్టర్ పరిధిలోని ఏపీఓ, ఈసీ, టీఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలి రేటును ప్రభుత్వం రూ.300లకు పెంచిందన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేనందున కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా చొరవ తీసుకోవాలని సూచించారు. భూమిని చదును చేయడం, కాలువలు, చెరువుల్లో పూడిక తీయడం వంటి పనులు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ రవి, ఏపీఓ, సీసీ, టీఏలు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి

నిందితుడికి రిమాండ్



అంబ్రేష్

తాండూరు రూరల్: ఓ ఆటో డ్రైవర్ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన కరన్‌కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ విఠల్ రెడ్డి కథనం ప్రకారం. పదో తరగతి చదివిన బాలిక (17) ఇటీవల సప్లమెంటరీ పరీక్షలు రాసింది. పక్క గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ అంబ్రేష్ పరీక్షల నిమిత్తం ఆమెను తాండూరుకు తీసుకెళ్లాడు. ఈ నెల 4న తాండూరులో జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లిన బాలిక.. తిరిగి వస్తుండగా అంబ్రేష్ తన ఆటోలో ఎక్కించుకున్నాడు. ఇంటి వద్ద దిగబెడతానని నమ్మబలికి.. గ్రామ శివారులోని పొలం వద్దకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఇంటికి వెళ్లిన బాలిక.. విషయం తల్లికి చెప్పడంతో అంబ్రేష్‌పై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా నిందితుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం. అంబ్రేష్ కొన్నాళ్లుగా భార్యతో దూరంగా ఉంటున్నట్లు తెలిసింది.

జన హోరు.. జాతర జోరు



తుక్కుగూడ సభ సక్సెస్

- భారీగా తరలివచ్చిన అభిమానులు
- నినాదాలతో హోరెత్తిన సభా ప్రాంగణం
- ఉత్సాహం నింపిన నేతల ప్రసంగాలు
- కాంగ్రెస్ శ్రేణుల్లో ఫుల్ జోష్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: కాంగ్రెస్ జనజాతరకు జనం పోటెత్తారు.. జై కాంగ్రెస్.. జై సోనియా, జై రాహుల్‌గాంధీ, జై రేవంత్‌రెడ్డి నినాదాలతో హోరెత్తించారు. ఇటు తుక్కుగూడ నుంచి శ్రీనగర్ ఈసిటీ ప్రధాన గేటు వరకు.. అటు పెద్ద గోల్కొండ నుంచి రావిర్యాల వరకు బారులు తీరారు. సభకు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షత వహించగా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభోపన్యాసం చేశారు. ప్రధాన వేదికపై కాంగ్రెస్ అధినేత రాహుల్ సహా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పార్టీ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆసీనులయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే తుక్కుగూడ వేదికగా ఆరు గ్యారంటీలను ప్రకటించి, అమలు చేస్తున్న కాంగ్రెస్.. తాజాగా లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జాతీయ స్థాయిలో ఇదే వేదిక నుంచి ఐదు గ్యారంటీలను ప్రకటించి సెంటిమెంట్‌ను కొనసాగించింది. నేతల ప్రసంగాలు పార్టీ శ్రేణుల్లో జోష్ నింపాయి. ఆశించినదానికంటే అధిక సంఖ్యలో జనం తరలిరావడం.. సక్సెస్ కావడంతో నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు.

అరగంట పాటు రాహుల్ ప్రసంగం..

సాయంత్రం 5.20 గంటలకే రాహుల్ శంషాబాద్ చేరుకోవాల్సి ఉండగా 6.40 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్వాగతం పలికారు. ఓఆర్‌ఆర్ మీదుగా తుక్కుగూడ ఎగ్జిట్ 14 నుంచి రాత్రి 7.7 గంటలకు రాజీవ్‌గాంధీ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ర్యాంపుపై నడుస్తూ కార్యకర్తలకు అభివాదం చేశారు. రాత్రి 7.16 గంటలకు పార్టీ జాతీయ ఐదు గ్యారంటీల హామీ పత్రాలను ఆవిష్కరించారు. రాత్రి 7.20 గంటలకు మొదలు పెట్టి 35 నిమిషాల పాటు ప్రసంగించారు.

మండుటెండలో..

మధ్యాహ్నం 2 గంటల నుంచే పార్టీ కార్యకర్తలు సభాప్రాంగణానికి చేరుకున్నారు. మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో సభకు తరలి వచ్చారు. నిలువ నీడ లేకపోవడం, టెంట్లు ఏర్పాటు చేయక పోవడం, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరికి లోనయ్యారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్, మహేశ్వరం సీనియర్ లీడర్ దేపా భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభకు తరలివస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



సభలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

సైడ్‌లైట్స్



కళాకారుల ఆటాపాట

- మధ్యాహ్నం 3 గంటల నుంచి రాష్ట్రం నలుమూలల నుంచి జనం రావడం ప్రారంభం కాగా.. రాత్రి 7 గంటల వరకు వస్తూ కనిపించారు.
- 5.30 గంటలకు జిల్లా నేతల ప్రసంగాలతో సభ ప్రారంభమైంది.
- శంషాబాద్ విమానాశ్రయం నుంచి నేరుగా రాహుల్ గాంధీ భారీ కాన్వాయ్‌తో పోలీసు బందోబస్తు మధ్య 7.10 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్నాయి.
- ఒకే కారులో రాహుల్ గాంధీ ముందు సీటులో కూర్చోగా, మధ్య సీటులో రేవంత్ రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్ రెడ్డి కూర్చొన్నారు.
- రాహుల్ ప్రసంగం అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రసంగించారు.
- రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ప్రసంగ సమయంలో కార్యకర్తలు పార్టీ జెండాలతో జోష్ కనబరిచారు.
- రాహుల్ గాంధీ ప్రసంగాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలుగులోకి అనువదించారు.
- బడంగ్‌పేట మేయర్ పారిజాత, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సంపత్, అద్దంకి దయాకర్, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డి, ఎంపీ అభ్యర్థులు సునీతారెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్ తమ ప్రసంగాల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌పై నిప్పులు చెరిగారు.
- సీతక్క ప్రసంగం ప్రారంభంలో కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు.
- కళాకారులు ప్రభుత్వానికి అనుకూలంగా తమ పాటలతో ఉత్తేజపరిచారు.
- సభకు జనాన్ని తరలించడానికి ఆర్టీసీతో పాటు ప్రైవేట్ బస్సులను తెప్పించారు.
- డప్పు వాయిద్య కళాకారులు శ్రీశైలం హైవే ఈ సిటీ కమాన్ నుంచి సభా ప్రాంగణం వరకు ప్రదర్శనలిస్తూ ముందుకు కదిలారు.
- సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ ఎల్‌ఈడీలపై ప్రజలు నేతల ప్రసంగాలను వీక్షించారు.
- నెహ్రూ ఔటర్ సర్వీస్ రోడ్డు, శ్రీశైలం జాతీయ రహదారి, ఈ సిటీ రోడ్లు పూర్తిగా కాంగ్రెస్ నాయకుల భారీ ఫ్లెక్సీలతో నిండి పోయాయి.
- మహిళలకు సభా ప్రాంగణంలో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు.
- వేసవిని దృష్టిలో ఉంచుకొని దాహార్తి తీర్చేందుకు పెద్ద ఎత్తున వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు.
- ఖమ్మం నుంచి ఎంపీ సీటును ఆశిస్తున్న మల్లు నందిని అనుచరులు పెద్ద ఎత్తున ఆమె ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిర్వహించిన ర్యాలీ ఆకట్టుకుంది.
- రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి పర్యవేక్షణలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.
- ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తుగా సూచించిన ప్రదేశాల్లోనే వాహనాలను పార్కు చేయించారు.
- బహిరంగ సభ అనంతరం పార్టీ శ్రేణులు తిరిగి బస్సుల వద్దకు చేరుకునేందుకు అంధకారం ఉండడంతో అసౌకర్యానికి గురయ్యారు. ట్రాఫిక్ సైతం స్తంభించడంతో గంటల తరబడి ఇబ్బందులు పడ్డారు.
- ట్రాఫిక్‌ను క్లియర్ చేయడం పోలీసులకు సవాలుగా మారింది.
- మేనిఫెస్టో విడుదల అనంతరం 8.30 గంటలకు సభ ముగిసింది.

– తుక్కుగూడ/పహాడీషరీఫ్

చెరువుల అభివృద్ధికి చర్యలు

- ఇరిగేషన్ ఎస్‌ఈ రంగారెడ్డి
- ఐనాపూర్ పెద్ద చెరువు పరిశీలన

దోమ: చెరువుల అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఎస్‌ఈ రంగారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని ఐనాపూర్ పెద్ద చెరువును ఇరిగేషన్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చెరువుల మరమ్మతులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇందుకోసం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. ఇటీవల గ్రామానికి చెందిన పలువురు రైతులు చెరువుకు మరమ్మతులు చేపట్టాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కోరారు. ఆయన ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలసి సమస్యను వివరించారు. దీంతో ఇరిగేషన్ అధికారులు ఐనాపూర్ పెద్ద చెరువును పరిశీలించారు. మరమ్మతులకు ఏ మేరకు నిధులు అవసరమో నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ రేణుక, డీఈ ప్రార్థసారథి, ఏఈ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.



ఐనాపూర్ పెద్ద చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ఇందిరమ్మ రాజ్యంతోనే మేలు

- లోక్‌సభ ఎన్నికల్లో విజయ దుందుభి మోగిస్తాం
- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి




జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దేశమంతటా విజయ దుందుభి మోగిస్తుందని స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ తుక్కుగూడలో జరిగిన కాంగ్రెస్ జనజాతర సభకు తాండూరు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మోదీ పాలనతో దేశ ప్రజలు విసిగి పోయారన్నారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చినప్పుడే సామాన్య ప్రజలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతారన్నారు. పదేళ్ల మోదీ పాలనలో పేద, మధ్య తరగతి ప్రజలపై పెనుభారం పడిందన్నారు. ఇందిరమ్మ రాజ్యం రావాలంటే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని కోరారు. జనజాతర సభలో రాహుల్, ప్రియాంక, మల్లికార్జున్ ఖర్గే ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తారన్నారు.



సింహ వాహనంపై విహరిస్తున్న శ్రీవారు



విశేష అలంకరణలో ఉత్సవమూర్తులు

సింహ వాహనంపై శ్రీవారు

పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్‌లోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి శనివారం సింహ వాహనంపై దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారిని అందంగా అలంకరించి మాఢ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. శుక్రవారం రాత్రి స్వామివారు హంస వాహనంపై విహరించారు.

– కొడంగల్

క్లుప్తంగా

కడుపునొప్పి భరించలేక..

యువతి ఆత్మహత్య

పెద్దేముల్: కడుపునొప్పి భరించలేక ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్‌సాన్‌పల్లిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గిరి కథనం ప్రకారం.. మండలంలోని మన్‌సాన్‌పల్లికి చెందిన లక్ష్మణ్, సీతాభాయ్ పెద్ద కూతురు అంజు(17), ఇంటర్ పూర్తి చేసి ఇంటివద్దనే ఉంటుంది. గత కొన్ని రోజుల నుంచి అంజు కడుపునొప్పితో బాధపడుతుంది. శుక్రవారం రాత్రి భోజనం చేసి పడుకుంది. ఉదయం లేచి చూసేసరికి ఫ్యాన్‌కు చున్నీతో ఊరేసుకొని మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

అనంతగిరి: అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీల మనోభావాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నర్సమ్మ, భారతి, అంబాబాయి, మనోహర, నిర్మల, మల్లమ్మ, సంతోష, సునీత, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం

- పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి
- కుంట్లూర్‌లో భారీ షెడ్ల కూల్చివేత



షెడ్డును కూల్చివేయిస్తున్న అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్: మున్సిపల్ పరిధిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలకు ఇప్పటికే నోటీసులిచ్చామని.. వాటిని త్వరలోనే కూల్చివేస్తామని పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్‌లో సర్వే నంబర్ 234, 235లో అక్రమంగా నిర్మించిన భారీ షెడ్లను జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. హైకోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారుల సమన్వయంతో రెండు జేసీబీల సాయంతో కూల్చివేతలు ప్రారంభించారు. కాగా షెడ్లలో తమ సామగ్రి ఆపాలని నిర్వాహకులు కోరడంతో రెండు వారాల గడువు ఇచ్చారు. గడువులోగా సామగ్రిని మరో చోటు తరలించాలని సూచించామని కమిషనర్ వెల్లడించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల మాజీ జెడ్పీటీసీ, బీఆర్ఎస్ నేత కందివనం సూర్యప్రకాష్ శనివారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిల సమక్షంలో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వరి పైరు ఎండుతోంది..

యాసంగిలో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. అప్పులు చేసి వేసిన వరి పంటలు ఎండిపోతుండటంతో అన్నదాత తల్లడిల్లుతున్నారు. దోమ మండల వ్యాప్తంగా 10, 537 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని రోదిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతన్నలు వేడుకుంటున్నారు..

- అడుగంటిన భూగర్భజలాలు
- ఆందోళనలో అన్నదాతలు
- పశువులకు మేతగా వరి పైరు



రాకొండలో వరి పంటలకు ట్యాంకర్‌తో నీరందిస్తున్న రైతు

దోమ : ఎండలు మండుతుండటంతో మండల వ్యాప్తంగా చెరువులు, కుంటలు, బావులు బావుల్లో పూర్తిగా భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి. దీంతో ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తే నీరందక పంటలు ఎండిపోతున్నాయని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాని దయనీయ పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

ఎండుతున్న పంటలు..

మండల వ్యాప్తంగా మొత్తం 36 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో ఎక్కువ మంది రైతులు చెరువులు, బోర్లపైనే ఆధారపడి పంటలను సాగు చేస్తుంటారు. బొంపల్లి, బాస్‌పల్లి, మైలారం, మోత్కుర్, ఖమ్మంనాచారం, శివారెడ్డిపల్లి, రాకొండ, ఐనాపూర్, దాదాపూర్, కిష్టాపూర్, తదితర గ్రామాల్లో రైతులు యాసంగి సీజన్‌లో 200 ఎకరాలు మొక్కజొన్న పంటసాగు చేయగా, 10, 537 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. అయితే, ఈ యాసంగి సీజన్‌లో భూగర్భజలాలు తగ్గిపోవడంతో చెరువులు, కుంటలు ఎండిపోయి బోర్లలో నీరు రాని పరిస్థితి నెలకొంది. దీంతోరైతులు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటిని పంటలకు అందిస్తున్నప్పటికి.. కొంత మంది రైతులు పశువులకు మేతగా వదిలేస్తున్నారు. అప్పులు తెచ్చి పంటలను సాగు చేస్తే పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని ఆందోళన చెందుతున్నారు.



బాస్‌పల్లిలో పశువులకు మేతగా తయారైన వరిపంట

ప్రభుత్వం ఆదుకోవాలి



భూగర్భ జలాలు అడుగంటడంతో పంటలు ఎండిపోతున్నాయి. పెట్టిన పెట్టుబడులు సైతం వచ్చేలా లేవు. ఆరు ఎకరాలల్లో వరి పంటను సాగు చేశా. అందులో రెండున్నర ఎకరాలకు నీరు అందక పశువులకు మేతగా తయారైంది. దీంతో రూ. 50 వేల నష్టం వాటిల్లింది. ప్రభుత్వం తమను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలి.

–వెంకటయ్య, రైతు, బాస్‌పల్లి

ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నాం..



చెరువులు, కుంటలు, బోర్లలో నీరు తగ్గిపోవడంతో వరి పైరు పూర్తిగా ఎండిముఖం పడుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీరును తెచ్చి వరి పంటకు వదిలి కాపాడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి ప్రభుత్వ నుంచి సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలి.

– టి. శ్రీశైలం, రైతు, రాకొండ

నివేదికలు ఇస్తున్నాం




భూగర్భజలాలు తగ్గుతుండడంతో పంటలు ఎండుతున్నాయి. దీంతో ఏ ఈఓలు ద్వారా ఎండిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను సేక రిస్తు న్నాం. రైతుకు ఎంత మేర నష్టం వాటిల్లిందో నివే దికలను ఉన్నతాధికారులకు అందిస్తున్నాం. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ప్రభాకర్‌రావు, మండల వ్యవసాయ అధికారి, దోమ

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కొందుర్గు: ఉద్యోగులు ఎన్నికల నియమావళిని పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రమేశ్‌కుమార్ హెచ్చరించారు. ఓపీఓలుగా విధులు నిర్వహించే సిబ్బందికి శనివారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో ఆయా మండలాల తహసీల్దార్లు రమేశ్‌కుమార్, జగదీశ్ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.



నేను చేసిన అభివృద్ధే కనిపిస్తోంది..

చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మోమిన్‌పేట: గ్రామాల్లో ఇప్పటికీ నేను చేసిన అభివృద్ధే కనిపిస్తుందని మాజీ ఎంపీ, చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చంద్రాయన్‌పల్లి, కోల్కుంద, అంరాధికుర్దు, మేకవనంపల్లి, రాళ్లగుడుపల్లి, టేకులపల్లి, మల్లారెడ్డి గూడెం గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014లో ఎంపీగా ఉన్న సమయంలో చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని 400గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేశానన్నారు. అవే నేటికి కన్పిస్తున్నాయన్నారు. ప్రస్తుత ఎంపీ రంజిత్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏం లేదన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం ప్రపంచం గర్వించేలా అభివృద్ధిలో దూసుకు పోతుందన్నారు. 10సంవత్సరాల బీజేపీ ప్రభుత్వంలో ఒక్క స్కాం కూడా లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రోజుకో స్కాం జరిగిందని ఎద్దేవా చేశారు. బాంబు బ్లాస్టులు, ఉగ్రవాదం పెట్రేగిపోతుండేదని అన్నారు. మళ్లీ మోదీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. పేదలకు ఉచిత రేషన్, రైతు సమ్మాన్, ఆయూష్మాన్ భారత్, ఉజ్వలతో పాటు రహదారుల విస్తరణ, విద్యాలయాల స్థాపన వంటి పథకాలను అమలు చేసిందని వివరించారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే వృథా అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటు వేసి నరేంద్ర మోదీకి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు కృష్ణారెడ్డి, అశిరెడ్డి, రమేశ్ తదితరులు ఉన్నారు.



మోమిన్‌పేట: మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి

దేశమంతా మోడివైపే..

అనంతగిరి: దేశమంతా మోడివైపే ఉందని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయన చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్ర శనివారం సాయంత్రం వికారాబాద్ మండలంలోకి ప్రవేశించింది. ఇందులో భాగంగా మండలంలోని పులుమద్ది, నారాయణపూర్, అత్వెల్లి, మదన్‌పల్లి, మైలార్ దేవరాంపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ముచ్చటగా మూడోసారి నరేంద్రమోదీ ప్రధానమంత్రి కాబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. నేడు గ్రామాల్లో ఎక్కడ చూసిన కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే కనిపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర నాయకులు పాండుగౌడ్, కేపీరాజు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు యాస్కి శిరీష, జిల్లా సీనియర్ నాయకులు రాజేందర్‌రెడ్డి, విజయ్‌రాజ్, రాములు, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు



అధికారులకు సూచనలు ఇస్తున్న సత్తర్

మండల ప్రత్యేకాధికారి ఎంఏ సత్తర్

తాండూరు రూరల్: వేసవికాలంలో పల్లెల్లో తాగునీటి సమస్య రానివ్వొద్దని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి (మండల ప్రత్యేకాధికారి) ఎంఏ సత్తర్ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉండొద్దని, తాగునీటిని వృథా చేయొద్దని సూచించారు. అలాగే, పారిశుద్ధ్యం మెరుగుపర్చాలన్నారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, ఉద్యానవన శాఖ డివిజన్ అధికారి మల్లిఖార్జున్, ఏఓ రజిత, మిషన్ భగిరథ ఏఈ ప్రణీత్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తప్పనిసరి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సుష్మ

ధారూరు: మండుతున్న ఎండలకు వడదెబ్బ తగలే అవకాశం ఉందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ధారూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సుష్మ సూచించారు. మండల పరిధిలోని గట్టెపల్లిలో శనివారం ఉపాధిహామీ పనులకు వెళ్లే కూలీలతో ఆమె మాట్లాడారు. వడదెబ్బ తగలకుండా 24 గంటల లోపు లీటర్ నీటిలో ఒక ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను కలిపి తాగాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, ఏఎన్ఎంల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉచితంగా లభ్యమవుతాయని వివరించారు. ఎండలో రోజువారి పనులు చేసుకునే వారు ఉ.11 గంటల లోపే తమ పనులను పూర్తి చేసుకోవాలని చెప్పారు. అత్యవసరమైతే తప్పా మధ్యాహ్నం బయటకు రావొద్దని, ఎండలో నుంచి వచ్చిన వెంటనే మంచినీరు తాగొద్దన్నారు. ముఖ్యంగా మసాల వంటకాలు తినకూడదని, వడదెబ్బ తగిలిన వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించాలని వివరించారు. అనంతరం ఉపాధి కూలీలందరికీ ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సురేందర్, ఏఎన్ఎం శోభ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



ధారూరు: ఉపాధికూలీతో మాట్లాడుతున్న సుష్మ



పరిగి: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జాగ్రత్తలు తీసుకోవాలి

పరిగి: పని సమయంలో ఎండలో తిరగాలంటే జాగ్రత్తలు పాటించాలని చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని నజీరాబాద్, సయ్యాద్‌మల్కాపూర్ గ్రామాల్లోని ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇస్తూ ఎండ తీవ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఎండలో తిరిగినప్పుడు నీరసంగా ఉంటే తప్పకుండా ఓఆర్ఎస్‌ను తీసుకోవాలని సూచించారు. ఎండల తీవ్రత రోజు రోజుకు పెరుగుతుందని కావున ప్రతి ఒక్కరూ మధ్యాహ్నం సమయంలో బయటకి రావద్దని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలను ఎండలో తిరగనివ్వద్దని వడదెబ్బ తగిలితే వెంటనే ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌ను సీజ్ చేయాలి

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

తాండూరు టౌన్ : తాండూరు పట్టణంలోని నారాయణ కార్పొరేట్ స్కూల్‌ను వెంటనే సీజ్ చేయాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు పి శ్రీనివాస్ శనివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 8వ తరగతి నుంచి పదో తరగతి వరకు అనుమతులు లేకుండా గత మూడేళ్లుగా తరగతులు నిర్వహిస్తున్న నారాయణ యాజమాన్యంపై విద్యాశాఖాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అంతేకాకుండా ఈ ఏడాది అకాడమిక్ సంవత్సరం ముగియకుండానే అడ్వాన్స్‌గా పదో తరగతి క్లాసులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా విద్యాశాఖ అధికారులు మొద్దు నిద్రవీడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై మానవహక్కుల కమిషన్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తామన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి నారాయణ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

టిప్పర్ సడెన్ బ్రేక్..

- వెనుక నుంచి ఢీకొట్టిన కారు
- ఒకరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు

చేవెళ్ల: ముందు వెళ్తున్న టిప్పర్ లారీ సడ్‌బ్రేక్ వేయటంతో వెనక వస్తున్న కారు లారీని ఢీకొట్టింది. ఈ ఘటన మోకిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొల్లూరు గేట్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్ జిల్లా కొత్రేపల్లి గ్రామానికి చెందిన భీంరావు(25), అదే జిల్లా పూడూరు మండలం ఉమ్మెంతాల గ్రామానికి చెందిన రాహుల్‌రెడ్డి స్నేహితులు. వీరిద్దరూ కారులో రాత్రి జన్వాడ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో డిన్నర్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కొల్లూరు గేటు వద్దకు రాగానే ముందు వెళ్తున్న టిప్పర్ సడన్ బ్రేక్ వేయడంతో కారు వేగంగా టిప్పర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవ్ చేస్తున్న రాహుల్‌రెడ్డికి తీవ్రగాయలవ్వగా పక్క సీట్‌లో కూర్చున్న భీంరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని లంగర్‌హౌస్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి కూడా విషమంగా ఉందని చెప్పారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చీర కొంగు మెడకు బిగించి..

మహిళ దారుణ హత్య



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

తాండూరు టౌన్: శ్మశానవాటికలో ఓ మహిళ దారుణంగా హత్య గురైన ఘటన శుక్రవారం రాత్రి తాండూరు పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ సంతోష్‌కుమార్ వివరాల ప్రకారం.. కోస్గి మండలం ముశ్రిప్పల్ గ్రామానికి చెందిన హన్మంతుతో తిరుపతమ్మ(40)కు 25 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఆమెకు సంతానం కలుగకపోవడంతో భర్త వదిలేశాడు. అప్పటి నుంచి తన తల్లిగారింట్లో ఉంటుంది. రెండు నెలల క్రితం తాండూరులోని సాయిపూర్‌లో నివాసం ఉంటున్న తన అక్క సుజాత ఇంట్లో ఉంటూ ఇళ్లల్లో పనులు చేసుకుంటూ జీవిస్తుంది. రోజు మాదిరిగానే పనికి వెళ్లిన తిరుపతమ్మ తిరిగి ఇంటికి రాలేదు. శనివారం స్థానిక బీసీ శ్మశాన వాటికలో ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న సుజాత వెళ్లి చూడగా.. మృతి చెందినది తన చెల్లెలు తిరుపతమ్మగా గుర్తించింది. స్థానిక డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ సంతోష్ కుమార్‌లు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. చీర కొంగుతో మెడకు చుట్టి హత్య చేసినట్లుగా గుర్తించారు. ఘటనా స్థలానికి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపి దర్యాప్తు ప్రారంభించారు. సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్

- రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్‌రెడ్డి, ఆనంద్, పట్నం నరేందర్‌రెడ్డి

పరిగి: మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతులను నట్టేట ముంచుతోందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆరోపించారు. శనివారం పట్టణ కేంద్రంలో రైతులకు మద్దతు ధరతో పాటు రూ.500 అదనంగా ఇవ్వాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అమలకు సాధ్యం కాని హామీలు ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేస్తూ పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు సక్రమంగా అమలు కావడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు ఎలాంటి కష్టాలు లేవని, ఎన్నో సంక్షేమాలు అందాయని గుర్తు చేశారు. మహిళలకు ప్రతి నెల రూ.2500, వంటగ్యాస్ రూ.500లకే ఇస్తామని ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, దోమ జెడ్పీటీసీ నాగిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్,మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్,రవికుమార్, రవీందర్, రాజేందర్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

కొడంగల్ : ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రైతులకు మద్దతుగా నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. రైతులకు యాసంగి సీజన్ నుంచే ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేలు పరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.



పరిగి: ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలన్నీ వెంటనే నెరవేర్చాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వికారాబాద్‌లోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు సమస్యల సాధనకు రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు రైతు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని మండిపడ్డారు. సాగునీరు ఇవ్వకుండా, రైతుబంధు, రుణమాఫీ వంటి పథకాలను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. వరికి బోనస్ ఇవ్వకుండా, ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం ప్రకటించకుండా రైతులను మోసం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుతాన్ని బద్నాం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ చూస్తుందన్నారు. పంటలు ఎండిన రైతులు ఆత్మహత్యలు చేసుకున్న పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, 24 గంటలు కరెంట్ ఇస్తామని సగం కరెంట్ కూడా రైతులకు ఇవ్వడం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగేందర్‌గౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ గోపాల్, రామస్వామి, సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, రాంరెడ్డి, శేఖర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, అంజయ్య, దేవదాసు, పాండు , అశోక్, కడియాల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



కొండగల్: ఎండిన వరిని చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే



వికారాబాద్: రైతు దీక్షలో పాల్గొన్న ఆనంద్, బీఆర్ఎస్ శ్రేణులు